## జాతరలో మంత్రి సీతక్క మొక్కులు

ఐలాపూర్‌లో మొక్కులు చెల్లిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం/కన్నాయిగూడెం, ఫిబ్రవరి 14 : ఏటూరునాగారం మండలం కొండాయి నాగులమ్మ, సార లమ్మ, గోవిందరాజుల జాతరతో పాటు కన్నాయిగూడెం ఐలాపూర్‌లో నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతరలో మంత్రి సీతక్క శుక్రవారం మొక్కులు చెల్లించారు. రెండు గ్రామాల్లో పూజారులు, నిర్వాహకులు సీతక్కకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు చిటమట రఘు, వావిలాల ఎల్లయ్య, లాలయ్య, నవీన్ పాల్గొన్నారు. కొండాయిలో గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మకు శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించారు. గురువారం రాత్రి గోవిందరాజులు గద్దెపైకి చేరినప్పటి నుంచి మొక్కుల చెల్లింపులు ప్రారంభమైనట్లు పూజారులు దబ్బగట్ల గోవర్దన్, రాజారా, రఘు తెలిపారు. శనివారం సాయంత్రం వన ప్రవేశం ఉంటుందని పూజారులు తెలిపారు. కన్నాయిగూడెం మండలం ఐలాపూర్‌లో సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న భక్తులు శుక్రవారం ఉదయం నుంచే తిరుగు ప్రయాణమయ్యారు. ఇప్పటి వరకు లక్ష మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. నేడు (శనివారం) సమ్మక్క ప్రధాన పూజారులైన మల్లెల వంశీయులు గొంతెమ్మ గుట్ట వద్దకు చేరుకొని తల్లిని వనప్రవేశం చేయనున్నారు. పూజారుల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి, ప్రధాన పూజారి మల్లెల మధు, సమ్మక్క పూజారి మల్లెల శివ, ప్రధాన వడ్డె కుర్సం చొక్కారావు, రాంబాబు, వినోద్, ఏర్పాట్ల కమిటీ పీరీల సురేష్, భాస్కర్, నాగేష్, తిరుపతి పాల్గొననున్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన డీపీవో

తాడ్వాయి, ఫిబ్రవరి 14 : జాతర పరిసరాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను శుక్రవారం డీపీవో దేవరాజ్ పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట, శివరాంసాగర్ చెరువు, జంపన్నవాగు, ఊరట్టం స్తూపం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎక్కడా చెత్త లేకుండా ఎత్తివేయాలని, ట్రాక్టర్‌లో లోడ్ చేసి వెంటనే డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. గద్దెల నుంచి జంపన్నవాగు వరకు దుమ్ము లేవకుండా రోడ్లపై వాటర్‌ను చల్లాలని, స్నానఘట్టాల వద్ద చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీవో శ్రీధర్‌కు సూచించారు.

## సింగరేణి సీఎండీని కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

బలరాంక్ పుష్పగుచ్ఛం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : సింగరేణి కార్మికుల చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం భూపాలపల్లికి వచ్చిన సీఎండీ ఎన్ బలరాంను టీబీజీకేఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ భూపా లపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సీఎంఆర్ నిధులను సింగరేణి ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలన్నారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ ఆసుపత్రులు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రుల్లో డాక్టర్లను నియమించాలని కోరారు. టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ సదానందం, నరేశ్‌నేత, రవీందర్, మల్లారెడ్డి, అవినాశ్, సురేశ్ పాల్గొన్నారు.

## శిక్షణతో ఉపాధి పొందాలి : ఐటీడీఏ పీవో

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14 : శిక్షణను వినియోగించుకుని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా కోరారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గిరిజన మహిళలకు ఉచిత జ్యూట్‌బ్యాగ్ తయారీలో ఇచ్చిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీవో శిక్షణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాము ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 35 మంది మహిళలకు 13 రోజుల పాటు జ్యూట్ బ్యాగులు తయారీలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వో సురేశ్‌బాబు, జేడీఎం కొండల్‌రావు, ట్రైనర్ తౌటి నాయుడు, జేఆర్‌పీలు పాపారావు, సరస్వతి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091
NTW-27793

WANTED

★ Wanted PRO's / Agents for MBBS, B.Tech Abroad Admissions. Contact Immediately Cell: 8121554649
NTW-326594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

### భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సౌకర్యాలు కల్పన ఎంతో ముఖ్యమని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతు, తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులు, సౌకర్యాల కల్పనపై అందజేసిన ప్రతిపాదనలకు సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. వసతి గృహాల్లోని విద్యార్థులు బాగా చదువుకోవడానికి అవసరమైన వసతి, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్ని వసతి గృహాల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని, కమిటీలు క్రమం తప్పక ఆహార నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అలాగే మండల ప్రత్యేకాధికారులు, సంక్షేమ శాఖల అధికారులు వసతి గృహాల్లో మెనూ అమలును తనిఖీ చేస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తాజా ఆహారం ఉట్టాలని సూచించారు. సౌకర్యాలు, మరమ్మతులు ప్రతిపాదనలు సీపీవోకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, సీపీవో బాబూరావు, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, గిరిజన సంక్షేమ శాఖ అకడమిక్ మానిటర్ రాజరత్నం పాల్గొన్నారు.

### ప్రభుత్వ కార్యక్రమాలకు

## ప్రైవేట్ స్కూల్ బస్సు

ములుగు, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా యంత్రాంగం తరుపున జరిగే ప్రతి కార్యక్రమానికి సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు కలెక్టర్ పేరును వాడుకొని విద్యాశాఖ అధికారులతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి బస్సులను ఉచితంగా వాడుకుంటున్నారు. శుక్రవారం జాతరకు వెళ్లేందుకు జర్నలిస్టులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ప్రైవేట్ బస్సు కేటాయించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు స్కూల్ బస్సులను వాడుకోవడంపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తున్నది. ప్రతి చిన్న కార్యక్రమానికి స్కూల్ బస్సులను ఏర్పాటు చేస్తుండగా పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులను ఇంటికి చేరవేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు వాపోతున్నాయి. గత నెల 24న మంత్రులు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కాగా, ఆ సమయంలో సైతం సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు స్కూల్ బస్సులను వాడుకున్నారు. విద్యాశాఖ, పౌర సంబంధాల శాఖ అధికారులు చెప్పినట్లు వినకుంటే తమ పాఠశాలలపై తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తారని యాజమాన్యాలు భయాందోళన చెందుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తాడ్వాయి, ఫిబ్రవరి14 : మేడారం జాతర ముగిసే వరకూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమంది భక్తులకు వైద్య సేవలందించారు. ఏఏ వ్యాధులతో వైద్యం పొందారనే విషయాలను రిజిష్టర్‌ను పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరంలో చికిత్సపొందుతున్న వారిని వైద్య సేవలపై అడిగితెలుసుకున్నారు. శుక్రవారం బీపీ తక్కువగా ఉండి వాంతులు విరేచనాలు చేసుకున్న, తేనెటీగల దాడిలో గాయపడిన 110 మందికి చికిత్స అందించామని డీఎంహెచ్‌వో తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను తనిఖీ చేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గణపురం, ఫిబ్రవరి 14: మండలంలోని పరుశరాం పల్లి జీపీ పరిధి రవినగర్ గ్రామానికి చెందిన బసవోజు వీరాచారి ఇటీవల మృతి చెందగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాలతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మృతుడి కుటుంబానికి రూ. 8 వేలు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన శ్రీరామ రైస్ మిల్ యజమాని అంకిళ్ల రఘుపతిరెడ్డి 50 కిలోల బియ్యం ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పేరాల దేవేందర్‌రావు, నాయకులు చెన్నబోయిన కృష్ణ, ఉడుత సాంబయ్యయాదవ్, పేరాల భాస్కర్‌రావు, సంపత్‌రావు, అంకిళ్ల తిరుపతిరెడ్డి, పబ్బోజు ఉపేంద్రా చారి, ఉల్లెంగల రాజు, తిరుపతి, చేకూటి రవీందర్, సూరంపెల్లి సుధాకర్ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల, ఫిబ్రవరి 14 : కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జడలపేట క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. నేరేడుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ తిమ్మనవేణి రజినీకాంత్, ఓనర్ మెట్టు రజినీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## 17న కోఠిలో సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14: 17వ తేదీన కోఠి ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు సదరం క్యాంపు కోసం కొత్తగా, రెన్యూవల్‌కు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

## పశుగణన పక్కాగా చేపట్టాలి

కాటారం(మహదేవపూర్), ఫిబ్రవరి 14 : పశుగణనను పక్కాగా చేపట్టాలని, బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వెంకన్న అన్నారు. మండలంలోని పుస్కుపల్లి, మజీద్‌పల్లి, కాళేశ్వరం, మెట్‌పల్లి, సూరారం గ్రామాలను వారు సందర్శించి చేపడుతున్న పశుగణనపై సమీక్షించారు. రికార్డులను తనిఖీ చేసి వివరాలను పరిశీలించారు. కాళేశ్వరంలో ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌కు శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూరారంలోని పశువైద్య ఉప కేంద్రం తనిఖీ చేయగా సిబ్బంది గైర్హాజరుపై ఆరా తీశారు. అనంతరం మహదేవపూర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. పశుగణన పురోగతి, డేటా ఖచ్చితంగా, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## జిల్లా కమిటీ ఎన్నిక

చిట్యాల, ఫిబ్రవరి 14 : సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్ ఫోరమ్ జిల్లా కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన చిగురు నాగరాజు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేశ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

# వనదేవతల సన్నిధిలో భక్తుల కోలాహలం

తల్లులకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 14 : మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు శుక్రవారం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తల్లులకు ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం గద్దెల పరిసరాలతో పాటు జంపన్నవాగు, చిలకల గుట్ట, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విడిది చేశారు. వన దేవతలను ఎస్పీ శబరీష్ దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

**భక్తులకు అన్ని సౌకర్యాలు : కలెక్టర్**

అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించామని, తల్లులను దర్శించుకున్న భక్తులు సంతోషంగా ఇళ్లకు వెళ్తున్నారని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మేడారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దెల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శనివారం లక్షకు పైచిలుకు భక్తులు అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉందని, ఆదివారం సెలవు కావడంతో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట జాతర ఈవో రాజేంద్రం ఉన్నారు.

**తినొద్దంటూనే చికెన్ వడ్డింపు**

ప్రభుత్వం, అధికార యంత్రాంగం చికెన్ తినొద్దు అని చెప్తూనే శుక్రవారం మేడారంలో జర్నలిస్టులకు వడ్డించారు. జాతర విజయవంతంపై ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దివాకర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా చికెన్ తినొద్దని, ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందని, దీనిపై అధికారులను అప్రమత్తం చేశామని కలెక్టర్ ప్రకటించారు. అనంతరం జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన భోజనంలో చికెన్ వడ్డించేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెనక్కి పిలిపించి అధికారులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన మటన్ కూరతో జర్నలిస్టులకు భోజనం వడ్డించారు.

**బస్సులు లేక భక్తుల అవస్థలు**

అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం శుక్రవారం తిరుగు ప్రయాణం అయ్యే భక్తులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండు గంటల పాటు బస్సుల కోసం వేచిచూశారు. భక్తులు వస్తున్నప్పటికీ ఆర్టీసీ అధికారుల మాత్రం బస్సులను అందుబాటులో ఉంచడం లేదు. అక్కడే విధుల్లో ఉన్న కంట్రోలర్‌ను బస్సులపై వాకబు చేయగా 'బస్సులు రాలేదమ్మా ఆగండి అంటూ' సమాధానం చెప్పున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కంటి తుడుపుగా ఎస్సారెస్పీ కాలువ పూడికతీత పనులు

డీబీఎం-38 కాలువను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేగొండ, ఫిబ్రవరి 14 : డీబీఎం 38 కాల్వల పూడికతీత పనులు కంటి తుడుపు చర్యలేనని, ఎమ్మెల్యే స్వలాభం కోసంమే తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం డీబీఎం 38 కాల్వల పూడికతీత పనులను వారు పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, రైతుబంధు సమితి జిల్లా మాజీ కో ఆర్డినేటర్ ఇంగె మహేందర్ మాట్లాడారు. డీబీఎం 38 కాలువ ద్వారా సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డిసెంబర్‌లో సాగునీరు విడుదల చేస్తే రైతులు యాసంగి పంటలు సాగు చేసేవారన్నారు. సాగునీరు విడుదల చేయాలని రైతులు పలుమార్లు ఎమ్మెల్యేతో పాటు అధికారులను కలిసినా ఫలితంలేదని, ఎవరూ పంటలు సాగు చేయొద్దని బహిరంగంగానే చెప్పడం బాధాకరమన్నారు. కాల్వలో పూడిక పేరుకుపోయిందని రైతులను నమ్మించడానికే పూడికతీత పనులు చేపట్టారన్నారు. కేవలం ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ స్వలాభం కోసమే పనులు చేస్తున్నారే తప్పా రైతులపై ప్రేమతో కాదన్నారు. రేగొండ, గోరికొత్తపల్లి ఉమ్మడి మండలాల పరిధిలో 24 కిలో మీటర్లు కాల్వ పొడవు ఉంటే కేవలం తొమ్మిది కిలో మీటర్లు మాత్రమే పూడిక పనులు చేపడుతున్నారని, ఇదికూడా అక్కడక్కడా చేసి వదిలేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి శుత్తశుద్ధి ఉంటే గోరికొత్తపల్లి నుంచి టేకుమట్ల టేలెండు వరకు పూర్తి స్థాయిలో పనులు చేసి నిరంతరంగా సాగునీరు ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో మంజూరైన అభివృద్ధి పనులే కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనులు చేశామని చెప్పున్నారని, వారు ఎక్కడ అభివృద్ధి చేశారో మండల కేంద్రంలోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు బహిరంగ చర్చకు రావాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలెపాక భిక్షపతి, జిల్లా నాయకులు బండి రమేశ్‌గౌడ్, మైస సృజన్ పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్ననాయకులు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 14 : ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగురి తిరుపతిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా మాజీ జడ్పీటీసీ జోరుక సద య్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, జిల్లా నాయకుడు బెల్లంకొండ శ్యాంసుందర్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాకర్తలకు సూచనలు చేశారు. అనంతరం మొగుళ్లపల్లి టౌన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుడిమల్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా రంపీస విజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎరబాటి మహేందర్, కార్యదర్శిగా బండారి సదయ్య, కోశాధికారిగా బత్తిని నరహరిగౌడ్, కార్యవర్గ సభ్యులుగా పడిదల తిరుపతిరావు, మంగళపల్లి సాంబయ్య, శనిగరపు అశోక్, బండారి భిక్షపతిని ఎన్నుకున్నట్లు తిరుపతిరావు ప్రకటించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు పడిదల జగ్గారావు, లక్ష్మణ్‌రావు, బండారి రామస్వామి, దేవునూరి కుమారస్వామి పాల్గొన్నారు.

# నిధులున్నా సౌకర్యాలు నిల్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 14 : మండలంలోని ఐలాపూర్ సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రభుత్వం నిధులు కేటాయించినా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు పూర్తి కాలేదు. దీంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తడంతో గురువారం తెల్లవారుజాము వరకే 70 శాతం మంది భక్తులు ఖాళీచేసి వెళ్లిపోయారు. పలు జీపీలకు చెందిన నాలుగు ట్యాంకర్ల ద్వారా భక్తులకు నీరు అందించారు. 3.5 లక్షలతో కొత్తగా బోర్ వేసినా మోటర్ పనిచేయక నీటి సరఫరా నిలిచింది. గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణంలో ఉన్న బోర్ మోటర్ గురువారం పనిచేయలేదు. మరోవైపు జాతరకోసం మొదలుపెట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

**తేలుమందు లేకపోవడంతో వైద్య శిబిరంపై దాడి**

ఐలాపూర్ జాతరలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో తేలు మందు లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసి దాడి చేసినట్లు తెలిసింది. గురువారం రాత్రి తేలు కుట్టిందని ఇంజిక్షన్ కోసం వచ్చిన భక్తులకు మందులు లేవని చెప్పడంతో వైద్య శిబిరంలో ఉన్న మందులను విసిరి పారేసినట్లు సమాచారం.

అసంపూర్తి పనులతో ఉన్న స్నాన ఘట్టం, నీటి ట్యాంక్

### పోచమ్మ గుడి

## తరలింపునకు ప్రతిపాదనలు

ములుగు, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : ములుగు ఆర్టీసీ బస్టాండ్‌ను మోడల్ బస్టాండ్‌గా మార్చేందుకు రూ.5.11కోట్లు విడుదల చేస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రస్తుత బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న పోచమ్మ గుడిని తరలించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు రోజుల క్రితం కుల సంఘాల నాయకులకు కలెక్టర్ సీసీ ఫోన్ ద్వారా పోచమ్మ గుడి తరలింపు విషయాన్ని తెలియజేసినట్లు తెలిసింది. త్వరలో వారితో సమావేశం నిర్వహించి నచ్చిన చోట గుడిని పునఃనిర్మిస్తామని చెప్పినట్లు సమాచారం. బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారికి సైతం నోటీసులు అందజేసినట్లు తెలిసింది. మొత్తం ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా ప్రభుత్వ రికార్డులో ఉండగా ప్రస్తుతం దానిని పూర్తి స్థాయిలో సేకరించి మోడల్ బస్టాండ్ నిర్మాణానికి వినియోగించనున్నట్లు సమాచారం. కాగా, పోచమ్మ గుడి తరలింపులో కుల సంఘాల నాయకులు, ములుగు ప్రజలు ఏ విధంగా సహకరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

## చెట్టును ఢీ కొన్న ట్రాక్టర్.. మహిళ మృతి

### ఐలాపూర్ జాతరకు వెళ్లివస్తుండగా ప్రమాదం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14 : కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులతో వెళ్లి వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడకం దేవో(45) మండలంలోని చెల్పాకలో మిర్చి కోత పనికి 20 రోజుల క్రితం వచ్చింది. కాగా, గురువారం రాత్రి బంధువులు, కూలీలతో ట్రాక్టర్ ట్రాలీలో ఐలాపూర్ జాతరకు వెళ్లింది. మొక్కులు చెల్లించుకొని శుక్రవారం ఉదయం తిరిగి చెల్పాకకు వస్తుండగా దొడ్ల అటవీ ప్రాంతంలోని మార్గ మధ్యంలో ట్రాక్టర్ డ్రైవర్ అన్నెబోయిన మహేందర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపు తప్పి రోడ్డు కింది వైపున ఉన్న చెట్టు ఢీ కొట్టింది.. దీంతో ఒకరి ఒకరు పడ్డారు. మడక దేవో అనే మహిళకు కడుపు, చాతీలో గాయాలై అస్వస్థతకు గురి కావడంతో వెంటనే ములుగులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరి పాయం పాగిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

## అడవి పంది ఢీకొని ఒకరికి గాయాలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : అడవి పంది ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన నేరేడుపల్లి సమీపంలో జరిగింది. బాధితుడి బంధువుల కథనం ప్రకారం.. ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు పొన్నాల రవీందర్ శుక్రవారం రాత్రి గొర్లవేడు నుంచి నేరేడుపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అడవి పంది ఒకేసారి వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో రవీందర్ కిందపడగా కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భూపాలపల్లి ప్రధాన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## వాహనం ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14: భూపాలపల్లి మండలం కమలాపూర్ రాంపూర్ రోడ్డు మార్గంలో గట్టమ్మ దగ్గర శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి నుంచి ఆజంనగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొంపెల్లి మధుకర్‌ను స్కార్పియో వాహనం ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మధుకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మధుకర్ స్వస్థలం కిష్టాపూర్ తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పోక్సో కేసులో ఒకరి రిమాండ్

కాటారం, ఫిబ్రవరి 14 : బాలికను వేధించిన కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అభినవ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కొన్ని రోజుల నుంచి ఓ యువకుడు వేధిస్తున్నాడు. అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బాలిక ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో సదరు బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడు నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 14 : మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన మారగోని రాజబాబు (40) బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి ఐలాపూర్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా కంతనపల్లి చెరువు మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## ఓవర్ లోడ్‌తో చిక్కితే కేసులు

మల్హర్, ఫిబ్రవరి 14 : ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో చిక్కితే కేసులు తప్పవని కొయ్యూర్ ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని మంథని- కాటారం ప్రధాన రహదారి వల్లెంకుంట క్రాస్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం రాత్రి చెక్ పోస్టు వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## యూరియాకు పురుగు మందులు లింక్ పెట్టొద్దు

టేకుమట్ల, ఫిబ్రవరి 14 : యూరియా కొనే రైతులకు పురుగు మందులను అంటకడితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి కళ్యాణి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, పురుగు మందుల డీలర్లకు విత్తన పురుగు మందుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. ఎరువులకు జతగా ఎటువంటి మందులు విక్రయించొద్దన్నారు. ఏఈవోలు రాహుల్, భరత్ యోగిత, డీలర్లు పాల్గొన్నారు.

## మాల మహానాడు ఆధ్వర్యంలో టేకుమట్ల బంద్

టేకుమట్ల, ఫిబ్రవరి14 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాల మహానాడు బంద్‌కు పిలుపునివ్వడంతో మండలాధ్యక్షుడు కొండ్ర ఓదెలు ఆధ్వర్యంలో వ్యాపార సంస్థలను మూసివేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంద్‌కు వ్యాపారస్తులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బందుల నరేశ్, బట్టల మొగిలి, గంధం కృష్ణయ్య, గంధం సారయ్య, భూపెల్లి రవీందర్ పాల్గొన్నారు

## ఇసుక క్వారీలను తనిఖీ చేసిన ఇంటలిజెన్స్ ఎస్పీ

కాటారం (మహదేవపూర్), ఫిబ్రవరి 14 : మహదేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల్లో ఇంటలిజెన్స్ ఎస్పీ భాస్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. మద్దులపల్లి, పలుగుల, కుంట్లం, పూసుకుపల్లి గ్రామాల్లోని ఇసుక క్వారీల్లోని స్టాక్ యార్డ్‌లను పరిశీలించారు. టీజీ ఎండీసీ సిబ్బంది, లారీ డ్రైవర్లతో మాట్లాడి లారీల్లో ఇసుక ఎంత మేర తీసుకెళ్తున్నారనే విషయాలను ఆరాతీశారు. అనంతరం వేబ్రిడ్జి కాంటాలను తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఇంటలిజెన్స్ డీఎస్పీ, ఉన్నారు.

## మినీ మేడారానికి వెళ్లి వస్తూ మృతి

ములుగురూరల్, ఫిబ్రవరి 14 : ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డేగల సారయ్య(55) మినీ మేడారానికి వెళ్లివస్తూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. సారయ్య అతను పనిచేసే ట్రాక్టర్ యజమాని కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మేడారం వెళ్లి అమ్మవార్లను దర్శించుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో కొంగల మడుగు సమీపంలో ట్రాక్టర్ నడుపుతూ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. కాగా, శుక్రవారం మృతదేహం ములుగు ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉండగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్‌తో పాటు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఎక్సల్ విరగడంతో కల్వర్ట్‌పై ఆగిపోయిన లారీ

## కల్వర్టుపై నిలిచిన లారీ.. తప్పిన పెను ప్రమాదం

కాటారం, ఫిబ్రవరి 14 : మండలంలోని శంకరాంపల్లి-ధన్వాడ మధ్యలో కల్వర్టుపై బొగ్గు లారీ మరమత్తులకు గుర్తై శుక్రవారం ఉదయం నిలిచిపోయింది. కల్వర్టుపైకి వెళ్లగానే ఒక్కసారిగా లారీ ఎక్సల్ విరగడంతో రెండు టైర్లు ఊడి ఒక పక్కకు ఒరిగింది. ఆ సమయంలో వాహనాలు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. రహదారి విస్తరణ పనులు, మరోవైపు లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.